ప్రజాశక్తి
సోమవారం 11 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం



13న వలసబల్లేరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం :

మండలంలోని వలసబల్లేరులో ఈనెల 13న పోలీసులు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ పక్కల గిరిజన గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి పరీక్షల కోసం ప్రత్యేక వైద్య బందం కూడా వస్తుందని, ఉవరైతే కంటి పరీక్షలు కోసం మెడికల్ క్యాంపుకు వస్తారో వారంతా తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్స్‌లను తీసుకొని వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు.

మన్యం బంద్ విజయవంతం

- జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలి
- ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి ప్రకటించాలి
- ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పలుచోట్ల ర్యాలీలు, రాస్తారోకోలు
- మూతపడ్డ దుకాణాలు... బోసిపోయిన రహదారులు



గుమ్మలక్ష్మీపురంలో మూతపడ్డ దుకాణాలు



కురుపాం : బోసిపోయిన నీలకంఠాపురం ప్రధాన రహదారి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలు 100శాతం గిరిజనులకే కేటాయించాలని, జిఒ 3 చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని, స్పెషల్ డిఎస్‌సి ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని తదితర సమస్యలపై ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆదివారం చేపట్టిన మన్యం బంద్ ప్రశాంతంగా జరిగింది. గుమ్మలక్ష్మీపురంలో గిరిజనులు ర్యాలీ, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.అవినాష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో, ఐసిడిఎస్ నియామకాల్లో గిరిజనేతరులతో భర్తీ చేశారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 6100 డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల్లో 1025 పోస్టులు గిరిజన సంక్షేమ శాఖకు కేటాయిస్తే రాష్ట్ర మొత్తం ఐటిడిఎ పరిధిలో 517 టీచర్ పోస్టులు నోటిపై చేశారని అన్నారు. ఇందులో కేవల 38 టీచర్ పోస్టులు ఆదివాసీలకు కేటాయించారని తెలిపారు. ఆదివాసీ ప్రాంతంలో ఐదు శాతం నివాసం ఉన్న గిరిజనేతరులకు 95శాతం నివాసం ఉన్న ఆదివాసీలకు ఐదు శాతం పోస్టులు కేటాయించిందన్నారు. జగన్ ప్రభుత్వం చర్యల వల్ల ఆదివాసీ యువత భవిష్యత్తు నాశనం కాబోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం తక్షణమే జిఒ 3కు చట్టబద్ధత కల్పించుట కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసీలకు 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, మాతృభాష వాలంటీర్లు రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం కోశాధికారి మండంగి రమణ, నాయకులు పి.మోహన్‌రావు, సన్యాసిరావు, శంకర్రావు, కుక్కిడి సర్పంచి బి.రాజారావు, సవర భాషా వాలంటీర్ల జిల్లా కార్యదర్శి భీమారావు తదితరులు ఉన్నారు.

కురుపాం : గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పువ్వల తిరుపతి రావు అన్నారు. ఆదివారం రాష్ట్ర మన్యం బంద్ పిలుపుమేరకు మండల కేంద్రానికి సమీపంలో గల మూలు గూడ జంక్షన్ వద్ద గిరిజన సంఘ నాయకులు, విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాన్ షెడ్యూలు ఏరియాలో గల 1500 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ చేర్చాలని, ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ఇవ్వాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మండంగి శ్రీను, సిఐటియు నాయకులు జి. వెంకటరమణ, గిరిజన సంఘం మండల నాయకులు పువ్వల రమేష్, మండంగి వెంకట్రావు, తాడంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

మొండెఖల్‌లో...

మండలంలో మన్యానికి ముఖ కేంద్రంగా ఉన్న మొండెంఖల్‌లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన మన్యం బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఈ బంద్‌కు విద్యార్థి, కార్మిక, ఉపాధ్యాయ, వివిధ ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఉలక వాసు ,ఆరిక కోరా, రాజేష్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని మామిడిపల్లిలో జరిగిన మన్యం బంద్‌లో ప్రశాంతంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామంలో గిరిజన సంఘ నాయకులు ర్యాలీ చేపట్టారు. ర్యాలీని ఉద్దేశించి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సీదరపు అప్పారావు మాట్లాడుతూ గిరిజనులకు రక్షణగా ఉన్న జీవో నెంబర్ 3ను వెంటనే పునరిద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకురావాలని, గిరిజన ప్రాంతాల్లో 100శాతం ఉద్యోగాలు ఆదివాసీ గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండలంలో అటవీ బంజరు భూములు సాగు చేస్తున్న గిరిజన పేదలకు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వంతల సుందరరావు, తాడంగి గాసి, నాయకులు పాంగి బిరుసు సురేష్ తదితరులు పాల్గొన్నారు



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న గిరిజన సంఘం, ప్రజాసంఘాల నాయకులు

సాలూరు: జీవో నెంబర్ 3 పునరుద్ధరణ కు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యాన విద్యార్థులు, గిరిజనులు ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు అఖిల్ కుమార్, డివైఎఫ్ఐ నాయకులు రాములు,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు ఆధ్వర్యాన విద్యార్థులు, గిరిజనులు పట్టణ ప్రధాన రహదారి మీదుగా ర్యాలీ చేపట్టారు. అనంతరం బోసు బొమ్మ జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. గిరిజనుల ప్రధాన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీతంపేట : మండలంలో ప్రజా సంఘాలు బంద్ జయప్రదం చేశాయి. ఆదివారం ఉదయం వ్యాపారులు, దుకాణదారులు స్వచ్ఛందంగా షాపులు, దుకాణాలు మూసివేసి బంద్‌కు సహకరించారు. బంద్ సందర్భంగా స్థానిక గిరిజన సంఘం కార్యాలయం నుంచి స్థానిక హై స్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, నాయకులు ఎం.తిరుపతిరావు, జె.శ్రీరాములు, బి.సాయి, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్ సురేష్, మాతృభాష విద్యా వాలంటీర్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్ దొంబు, జిల్లా అధ్యక్షులు ఎస్.ఆనందరావు, యుటిఎఫ్ గౌరవఅధ్యక్షులు ఆరిక భాస్కర్ రావు, జిల్లా కార్యదర్శి పాలక కృషారావు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : మండలంలో మన్యం బంద్ ప్రశాంతంగా జరిగింది. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగ సీతారాం ఆధ్వర్యాన రావాడ రామభద్రపురంలో ర్యాలీ నిర్వహించి తమ నిరసనను తెలిపారు. జిఒ 3ను పునరుద్ధరించాలని, 1/70 చట్టాన్ని పకగ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బి.మోహన్‌రావు, గిరిజనులు, రైతులు పాల్గొన్నారు.

కొమరాడ : ఆదివాసీ హక్కుల రక్షణకై ఆదివారం తలపెట్టిన ఏజెన్సీ బంద్ సందర్భంగా కొమరాడలో ర్యాలీ, నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు లక్ష్మము, సుబ్బారావు, వెంకట్రావు, పెద్దసంఖ్యలు గిరిజనులు, మహిళలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : గిరిజన హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను ఓడించాలని మన్యం జిల్లా గిరిజన సంఘ కార్యదర్శి కె.రామస్వామి అన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర బంద్ సందర్భంగా స్థానిక సుందరయ్య భవనం నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వెళ్లి కూడలి వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రామస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆదివాసీల కోసం ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, జీవో 3కు చట్టబద్ధత కల్పించి ఆర్డినెన్స్ తీసుకురావాలని, ఆదివాసి ప్రాంతాల్లో 100శాతం ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలని, నాన్ షెడ్యూలు 1500 ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ చేర్చాలని, ఆదివాసి ప్రత్యేక డీఎస్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్.లక్ష్మణరావు, బలరాం, శంకర్రావు, జగ్గన్న, మోహన్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, బి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శి కె.రాజు పలువురు సంపూర్ణ మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.

పాచిపెంట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి మెయిన్ రోడ్డు మీదుగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్ని రామయ్య, సీనియర్ నాయకులు సూకూరు అప్పలస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టం ప్రకారం ప్రతి గిరిజన కుటుంబానికి 10 ఎకరాలు చొప్పున పట్టాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు సిఐటియు, వ్యవసాయ కార్మికసంఘం, ఆటో సంఘం నాయకులు పోలి రాజు, సురు రామారావు ఆటో కార్మిక సంఘం నాయకులు ఆకుల వెంకటరమణ బంద్‌కు మద్దతు తెలిపారు



గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట, సాలూరు, సీతంపేట, కొమరాడ మండల కేంద్రాల్లో రాస్తారోకో చేస్తున్న ఆదివాసీ గిరిజన , ప్రజాసంఘాల నాయకులు



అసలేం జరుగుతోంది?

పుర పాలన తీరుపై జనం పెదవి విరుపు

నేడు మున్సిపల్ సమావేశం

మున్సిపల్ సాధారణ సమావేశం ఉదయం 11 గంటలకు జరుగనుంది. చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్ లు హాజరుకావాలని కమిషనర్ ప్రసన్న వాణి ఒక ప్రకటనలో కోరారు.

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాలిటీలో అసలేం జరుగుతున్నదో అర్థం కాని పరిస్థితి పట్టణ ప్రజలకు కనిపిస్తోంది. గత కొద్ది నెలలుగా పురపాలన తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో వెలుగులోకి వచ్చిన కొన్ని పరిణామాలు మున్సిపాలిటీ ప్రతిష్ట మసకబారేలా చేస్తున్నాయి. గత ఏడాది ఆగస్టులో మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు ఎసిబి వలలో చిక్కి సస్పెండ్ అయ్యారు. ఆ తర్వాత మున్సిపల్ ఆర్వో రమేష్ అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య కు పాల్పడ్డారు. మున్సిపాలిటీ పాలనపై పట్టు సాధించిన ఏక నాయకత్వం లేకపోవడంతో నాలుగు గోడల మధ్య జరిగిన పరిణామాలు రచ్చకెక్కుతున్నాయి. దీంతో పాలకవర్గంలో అంతర్గత విబేధాలు బజారున పడుతున్నాయి. మున్సిపాలిటీ నాయకత్వం వహిస్తున్న చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ తన సొంత పార్టీ కౌన్సిలర్లను సమన్వయం చేసుకుంటూ పాలించడంలో విఫలమవుతున్నారు. దీంతో అధికారపార్టీ కౌన్సిలర్ల మధ్య అగాధం పెరుగుతూ వస్తోంది. కౌన్సిల్ సమావేశాల్లో స్వపక్షంలోనే విపక్షం అన్న చందంగా పాలకవర్గం తీరు మారింది. పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇదే తీరు కనిపిస్తుండడంతో ప్రజాసమస్యలు సకాలంలో పరిష్కారం కాని పరిస్థితి కనిపిస్తోంది. మున్సిపల్ సమావేశపు అజెండాలో అంశాలపై ఇంతవరకు ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించిన దాఖలాలు లేవు. వైసిపి కౌన్సిలర్లే అజెండాలో అంశాలను అడ్డుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి.

షాడో చైర్ పర్సన్ పై విమర్శలు

మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ భర్త నాగేశ్వరరావు అనారోగ్యం కారణంగా ఇంటికే పరిమితమయ్యారు. ఆయన ఆరోగ్యంగా వున్నంతకాలం పరిపాలన కొంతవరకు సజావుగా సాగింది. ఆయన అనారోగ్యానికి గురైన తర్వాత కుమారుడు శ్రీనివాస్ భరత్ దృష్టి సారించారు. తెలిసీ తెలియని పరిజ్ఞానంతో ఆయన పరిపాలనపై పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. షాడో చైర్మన్‌గా వ్యవహరిస్తూ అధికారులపై పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాలకవర్గ సభ్యుల మధ్య విబేధాల కారణంగా అధికారులు నలిగిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ముందుకెళ్తే నుయ్యి వెనక్కి వెళితే గొయ్యి అన్న చందంగా వారి పరిస్థితి తయారైంది. మున్సిపాలిటీలో బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ నుంచి ఇంటి పేరు మార్పు వరకు అన్ని వ్యవహారాలకు సంబంధించిన ఫైళ్లు తన వద్దకు రావాలని షరతులు పెడుతున్నారు. సంబంధిత వ్యవహారాల వ్యక్తులను కూడా ఇంటికి పంపించాలని హుకుం జారీ చేయడంతో అధికారులు బెంబేలెత్తి పోతున్నారు.

షాపు అద్దె బాగోతంపై బెడిసి కొట్టిన డ్రామా

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20వ నెంబర్ షాపు అద్దె సుమారు రూ.3.5 లక్షల గోల్ మాల్ వ్యవహారంలో అధికారపార్టీ కౌన్సిలర్ల మధ్య విబేధాలు స్పష్టంగా కనిపించాయి. సుమారు ఐదేళ్ల పాటు మున్సిపల్ షాపును వాడుకుంటున్న వ్యక్తి మున్సిపాలిటీకి అద్దె చెల్లించడం లేదు. ఈ షాపు ఖాళీగా ఉందని కౌన్సిల్ సమావేశంలో రెవెన్యూ అధికారులు చెప్పడంతో అనుమానం వచ్చిన వైసిపి కౌన్సిలర్లు దానిపై ఆరా తీశారు. అది ఖాళీగా లేదని, అనధికారికంగా ఛార్టర్డ్ అకౌంటెంట్ అధీనంలో వుందని తెలుసుకున్న కౌన్సిలర్లు నిరూపించే ప్రయత్నం చేశారు. 2017 నుంచి షాపు తన అధీనంలో ఉందని ఛార్టర్డ్ అకౌంటెంట్ వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు, రెవెన్యూ అధికారుల సమక్షంలో చెప్పడంతో అసలు విషయం బయట పడింది. ఆ షాపు అద్దె డబ్బులు రూ.3.5 లక్షలు ఎవరి ఖాతాలోకి వెళ్ళాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ గోల్ మాల్ వ్యవహారం తేల్చాలని జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. అదేరోజు సాయంత్రం చైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ మున్సిపల్ ఆర్వో రాఘవాచార్యులు, ఆర్ఐ శ్రీనివాసరావును పిలిపించి శివాలెత్తినట్టు తెలిసింది. ఆ షాపు తాళం ఎప్పుడో తనకి అప్పగించారని, ఆ విషయం మీకు చెప్పలేదా అని ఆగ్రహించారు. ఆమె మాటల తీరు చూస్తే షాపు అద్దె బాగోతాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేసినట్లు కనిపించింది. షాపు అద్దె దారిమళ్లిన వ్యవహారాన్ని అధికారుల పైకి నెట్టే ప్రయత్నం చేశారు. పట్టణంలోని వెంకటేశ్వరా డీలక్స్ స్థలం కోర్టు వివాదంలో ఉన్నప్పటికీ కొనుగోలుదారుల పేరిట మ్యుటేషన్ చేయడం చర్చనీయాంశ మవుతోంది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు అందడం వల్లనే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వివాదానికి ముగింపు పలికారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తలవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

వీరఘట్టం : మండలంలోని తలవరంలో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ ఆధ్వర్యంలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిష్ట మధుసూదన్ రావు, ఎంపిపి డి వెంకటరమణ నాయుడు, ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, పనస నందివాడ మాజీ సర్పంచ్ కొరికన సన్యాసినాయుడు, బి.సూర్య ప్రకాష్, భౌరోతు రాజశేఖరం, డి.భుజంగరావు, వైశ్యరాజు గోవిందరాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

12న మెగా నేత్ర వైద్య శిబిరం

వీరఘట్టం: మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి మందిరంలో ఈనెల 12వన మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవజీవన్ తిరుపతి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కె ఎస్ ఆచార్య ఆర్థిక సహాయంతో పాలకొండ మండలం బడ్డు మాసింగి ప్రగతి సేవ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా అందత్వ నివారణ సంస్థ, విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్యశిబిరం జరుగుతుందని తెలిపారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు


హాజరు కానున్న 11,198 మంది విద్యార్థులు

'ప్రజాశక్తి'తో జిల్లా విద్యాశాఖాధికారి పగడాలమ్మ ముఖాముఖి



మార్చి 18 నుంచి 30 తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా విద్యా శాఖ అధికారి పగడాలమ్మ తెలిపారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే...

-ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్



ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు?

ఈవిద్యా సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 11,198 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో బాలురు 5124, బాలికలు 5410 మంది, ఉండగా, గతంలో పరీక్ష తప్పిన వారు 664 మంది ఉన్నారు.

ఎన్ని కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి?

ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జిల్లాలోని రెండు డివిజన్లో 66 కేంద్రాల్లో జరగనున్నాయి. పార్వతీపురం డివిజన్లో 35, పాలకొండ డివిజన్లో 31 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి.

పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో పరీక్ష రాసుకొనేలా గాలి, వెలుతురు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశాం. కొన్ని కేంద్రాల్లో ఫర్నీచర్ సౌకర్యం అరకొరగా ఉంటే వెంటనే ప్రత్యామ్నాయం చర్యలు తీసుకొని బల్లలు ఏర్పాటు చేశాం. వేసవి కారణంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు ఏర్పాటు చేయడంతో పాటు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం.

ఎన్ని శాఖలు సహకారం అందిస్తున్నారు?

పరీక్షలు విజయవంతానికి ఇప్పటికే విద్యుత్, రెవెన్యూ, పోలీస్, రవాణా, వైద్య శాఖల సహకారం తీసుకున్నాం. రవాణా విషయంలో విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అన్ని రూట్లలో ఆర్టీసి బస్సులు విద్యార్థులకు అందుబాటులో ఉంచాం.

పరీక్షా కేంద్రాల్లో చూసి రాతలు, ఇతర ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకున్న చర్యలేమిటి?

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఇబ్బందులూ లేకుండా 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్ షాపులకు నోటీసులు ఇచ్చాం. పరీక్ష సమయంలో మూసేయడం జరుగుతుంది. కేంద్రాల సమీపాన ప్రజలు గుమిడూడి ఉండకుండా ఉండేందుకు పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేశాం.

ఎంతమంది సిబ్బందితో పరీక్షలు నిర్వహిస్తున్నారు?

66 కేంద్రాల్లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు 66 మంది సిట్టింగ్ స్క్వాడ్లు, 66 డిపార్ట్ మెంట్‌ల అధికారులు, 6 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 518 మంది ఇన్విజిలేటర్లను నియమించాం.

ఈ ఏడాది ఫలితాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఎలా ఉండనున్నాయి?

ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు గత ఏడాది కంటే మెరుగ్గా వచ్చే అవకాశాలున్నాయి. సకాలంలో సిలబస్ పూర్తి చేసి రివిజన్ తరగతులు ఏర్పాటు చేశాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశాభావంతో ఉన్నాం.

పరీక్షలు ఎన్ని రోజులు, ఏ సమయంలో జరగనున్నాయి? విద్యార్థులు ఏ సమయానికి హాజరు కావాలన్న నిబంధనలు ఏమైనా ఉన్నాయా?

పరీక్షలు ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటలు వరకు జరగనున్నాయి. ప్రతి విద్యార్థి పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలి. పరీక్ష ప్రారంభమైన అర గంట వరకు సమయం ఉంటుంది. అయితే ఒకే విద్యార్థి రెండు రోజులు అదే అరగంట ఆలస్యంగా వస్తే మూడో రోజు పరీక్షకు అనుమతించేది లేదు.

ప్రశ్నాపత్రాలు ఉంచేందుకు ఎన్ని స్టోరేజీ పాయింట్లు ,ఎన్ని రూట్లలో పంపిణీ చేయనున్నారు?

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు పార్వతీపురం బాలికోన్నత పాఠశాల స్టోరేజ్ పాయింట్లో ఉంచుతున్నాం. వీటిని పరీక్షా కేంద్రాలకు 6 రూట్లలో తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలు వేస్తున్న సంజీవనాయుడు

పెదపెంకిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా గ్రామ ప్రజలు, యువత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ పూడి హరిప్రసాద్ పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూలే ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో యువత కోట గౌరీనాథ్, గొర్లె శ్రావణ్‌కుమార్, పెంకి పరశురాం, వృక్షప్రేమికుడు దయానంద్ డాక్టర్ శ్రీను పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నడుకూరు, బొద్దపాడు, తెట్టంగి లో జనసేన ఉత్తరాంధ్ర నాయకులు బిపి నాయుడు , ఎం.పుండరీకం, వజ్రగడ జానీ, గర్భాన నరేంద్ర ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జోగారావును కలిసిన రంగంపేట గ్రామస్తులు

ఎమ్మెల్యేను కలిసిన రంగంపేట గ్రామస్తులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

సీతానగరం మండలం, రంగంపేట పంచాయతీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అలజంగి జోగారావును ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తామంతా ఎమ్మెల్యే వెంటే వైసిపిలోనే ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, నాయకులు బలగ శ్రీరాములు నాయుడు, యాళ్ళ వెంకటరమణ, పోల తిరుపతిరావు, పోల సరస్వతి, కోట రామకృష్ణ, నగిరెడ్డి వెంకటేష్, అలజంగి సత్యం, పెంట సత్యం, పూడి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి గూటికి పోల సత్యనారాయణ

టిడిపి పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్ చంద్రకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన పార్వతీపురం పట్టణానికి చెందిన విద్యాసంస్థల అధినేత పోల సత్యనారాయణ టిడిపిని వీడి ఆదివారం ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైసిపిలో చేరారు. గతంలో ఎమ్మెల్యే జోగారావు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంలో కీలకపాత్ర వహించిన ఆయన పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది కాలానికి పార్టీకి దూరమయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో పార్వతీపురం పర్యటనకు వచ్చిన టిడిపి అధినేత చంద్రబాబు చేతుల మీదుగా కండువా కప్పుకొని టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం టిడిపిలో క్రియాశీలకంగా మారి అంతగానో వ్యవహరించారు. ఒక్కసారిగా ఆయన టిడిపిని వీడి వైసిపికి తరలిపోవడం టిడిపి పార్టీ సంఘర్షణల్లోనూ గురిచేసింది. అకస్మాత్తుగా ఆయన పార్టీ వీడడానికి కారణాలు తెలియాల్సి ఉంది.



సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేద్దామని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కె.మల్లేశ్వరరావు అన్నారు. ఆదివారం కురుపాంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు నేరేడబల్లి వంశీ ఆధ్వర్యంలో ఐదు మండలాల జనసేన నాయకులతో జరిగిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్దిరోజులు మాత్రమే సార్వత్రిక ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలన్నారు. ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగి గెలిపించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శులు జి.గౌరీ శంకరరావు, పి.శంకరరావు, దుమ్మంగి పంచాయతీ సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, ఐదు మండలాల జనసేన నాయకులు వారణాశి శివకుమార్, లచ్చిపతుల రంజిత్ కుమార్, వావిలపల్లి రాజేష్, గంటేడ భార్గవ నాయుడు, పోలినాయుడు, దాసరి శ్రీను, పల్లి శ్రీకాంత్ , రవి, శివ, క్రాంతి, వాసు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా నిఘా నేత్రం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నిఘా నేత్రం (సిసి కెమెరా) గుడ్డిదయ్యింది. 2019లో ఈ కార్యాలయంలోకి ఇతరలు ఎవరు వస్తున్నారు.. వెళ్తున్నారన్న విషయం తెలుసుకోవడానికి ఏర్పాటు చేసిన నిఘా నేత్రం మరుగున పడిన సంఘటన ఆఫీసులో చోటు చేసుకుంది. మండలానికి సంబంధించి అన్ని లావాదేవీలు, ఎంతో విలువైన దస్త్రాలు కార్యాలయంలో ఉండగా అధికారులు ఈ విషయంపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అటు ఉన్నతాధికారులకు ఇటు ప్రజలకు పలు అనుమానాలు ఏర్పడుతున్నట్లు గుసగుసలు వినపడుతున్నాయి. అయితే ఇప్పటికే ఈ కార్యాలయంలో చాలా వరకు ఫైల్స్ తారుమారు చేసిన సంఘటలెన్నో ఉన్నాయని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఈ కార్యాలయంలో జరుగుతున్న వ్యవహారం ఎక్కడ బయట పడుతుందోనని అధికారులు పని చేయని నిఘా నేత్రం చాటున చిత్రాలెన్నో చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదివరకు మండలం అభివృద్ధి అధికారిపై అనేక ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. కావున ఇకనైనా అధికారులు ఈ నిఘా నేత్రం పని చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవశ్యకత ఎంతైన ఉందని పలువురు ప్రజలు కోరుతున్నారు.



ఎంపిడిఒ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న సిసి కెమెరా

మహిళా హక్కులపై ప్రభుత్వాల దాడి

మహిళా దినోత్సవ సదస్సులో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - సాలూరు

మహిళా హక్కుల పై దాడులు చేస్తున్న ప్రభుత్వాలపై పోరాటానికి పిడికిలి బిగించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి పిలుపునిచ్చారు.అంతర్జాతీ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో శ్రామిక మహిళా సంఘం నాయకులు శశికళ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉదాసీన వైఖరి కారణంగా మహిళలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవని చెప్పారు. మణిపూర్ లో ఒక వర్గం మహిళలపై ప్రభుత్వమే దాడులు ప్రోత్సహించిందని చెప్పారు. అలాంటి దాడులను రాష్ట్రం లోని పాలక పార్టీలు కనీసం ఖండించలేదన్నారు. మహిళా సాధికారత పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని అన్నారు. మహిళా చట్టాలను అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వాలు లేవన్నారు. ఇలాంటి ప్రభుత్వాలపై ఐక్యం గా పోరాడాలని కోరారు.అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా జ్యోతి, యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు కోలక లీల, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు జ్యోత్స్న, భోజన నిర్వాహకుల సంఘం నాయకులు సుశీల, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహిళా నాయకులు దేవి ప్రసంగించారు. కార్యక్రమంలో నాయకులు భారతి, కుమారి, జానకి ,శాంత ,సుజాత, పోలమ్మ ,ఉత్తరమ్మ, తిరుపతమ్మ ,పుష్ప, నారాయణమ్మ, గౌరీ ,ఇందిరా, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

కొమరాడ : మహిళలకు ఉపాధి సాధికారిత, అభివృద్ధి ఎక్కడ ఉందని మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా కార్యదర్శి వై.శాంతికుమారి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యాన అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు కొమరాడలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ కొమరాడ ప్రాజెక్టు ఉపాధ్యక్షులు సిరికి అనురాధ అధ్యక్షతన జరిగిన సభలో శాంతకుమారి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి మహిళలకు రక్షణ లేకుండా చేస్తుందని, పోరాడి సాధించుకున్న మహిళా హక్కులను చట్టాలను కాలరాస్తూ పాతకాలమునాటి పరిస్థితికి తీసుకొస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్ ఘటన యావత్ భారతదేశాన్ని కలిసి వేసిందని ఇటువంటి ఉన్మాదుల వల్ల మహిళలకు ఎటువంటి రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలంతా సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, అంగన్వాడీ, ఆశా, కమ్యూనిటీ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

బిజెపితో పొత్తు రాష్ట్రానికి ముప్పు : సిపిఎం

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

బిజెపితో టిడిపి పొత్తు రాష్ట్రానికి ముప్పు అని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక సుందరయ్య భవనంలో మాట్లాడుతూ బిజెపి, టిడిపి, జనసేనతో కలసి రాష్ట్రానికి మరణ శాసనం రాసిందన్నారు. ఈ పొత్తు రాష్ట్రాభివృద్ధికి విఘాతమన్నారు. ప్రజల అభీష్టానికి వ్యతిరేకమని, రాష్ట్రానికి ద్రోహం చేసిన మతోన్మాద బిజెపితో పొత్తు పెట్టుకోవడం విశ్వాస ఘాతుకానికి పాల్పడటమేనని గుర్తు చేశారు. హోదా ఇవ్వకుండా నిరాకరించిన బిజెపితో భాగస్వామిగా ఎన్‌డిఎలో చేరుతున్నామని చంద్రబాబు ప్రకటించడం తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమేనన్నారు. రాష్ట్ర ప్రజలతో తిరస్కరించబడిన బిజెపితో ఎందుకు పొత్తు పెట్టుకున్నారో టిడిపి రాష్ట్ర ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు దేశమంతా తిరిగి బిజెపి విద్రోహాన్ని, మతోన్మాదాన్ని ఎండగట్టారని ఇప్పుడు అదే బిజెపితో కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి నమ్మ బలకటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను మూసేయడానికి శ్రమ పడుతున్న బిజెపితో కలసి రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దుతామంటే ప్రజలు ఎలా నమ్ముతారన్నారు. టిడిపి కార్యకర్తలు ఈ పొత్తును వ్యతిరేకించాలని కోరుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపిని బిజెపితో పొత్తు పెట్టుకున్న పార్టీలను నిరంకుశ వైసిపిని ఓడించాలని కోరారు.

సీతంపేటలో పోలీసు కవాతు

సీతంపేట : ఎన్నికల నేపథ్యం తరుణంలో పాలకొండ సిఐ చంద్రమౌళి, ఎస్సై ఎం.జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో పోలీస్ కవాత్ సీతంపేటలో ఆదివారం నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ఐటిడిఎ వరకు సిఆర్పిఎఫ్ బలగాలు ర్యాలీ నిర్వహించాయి. ఎన్నికల నేపథ్యంలో ముందస్తుగా బలగాలు అప్రమత్తం చేశారు.

పరిష్కారం చూపని 'స్పందన'

ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు దాలినాయుడు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో "జగనన్నకు చెబుదాం" పేరుతో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని జాతీయ మానవ హక్కుల కమిటీ, ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి దాదాపు 90 నుండి 100 వరకు అర్జీదారులు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తున్నారన్నారు. అయితే వీటి పరిష్కారం మాత్రం ఆశించినంతగా కానరావడం లేదన్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పలు వ్యయ ప్రయాసలకులోనై సమస్యలు పరిష్కరిస్తారన్న గంపెడంత ఆశతో జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వస్తే ఆ సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కావడం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రజలకు స్పందన కార్యక్రమంపై నమ్మకం పోతోందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలు, జిల్లాలోని నదులు, గెడ్డల నుండి ఇసుక అక్రమ రవాణా తదితర వాటిపై ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందనలో కనీస స్పందన లేదని అర్జీదారులు అంటున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీ చేస్తే ఒక తెల్ల కాగితం దండగేనన్న మాటలు తరచూ వినిపిస్తున్నాయన్నారు. ఇదిలా ఉండగా ప్రతి వారం సమస్యల పరిష్కారం కోరుతూ వందకు పైబడి అర్జీలు రావడం గమనార్హమన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుందన్నారు. పలువురు ఒకే సమస్యపై రెండు మూడుసార్లు స్పందన కార్యక్రమానికి వచ్చే సందర్భాలు లేకపోలేదన్నారు. కొంతమంది విసుగెత్తి విరమించుకునే పరిస్థితి ఉందన్నారు. కొన్ని శాఖలకు చెందిన అధికారులు సిబ్బంది పనితీరు వల్ల ఈ పరిస్థితి నెలకొంటుందన్నారు. తక్షణమే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై స్పందించి పరిష్కరించాలన్నారు. అర్జీదారు సమస్య పరిష్కారమైనది లేనిదీ అర్జీదారు దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. అంతేగాని మొక్కుబడిగా కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల ఉపయోగం లేదన్నారు. అలాగే వేసవి సందర్భంగా రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకునే అవకాశం ఉందని, వాటి నివారణకు తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కౌన్సిల్ సమావేశం క్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి వారం స్పందన ఫిర్యాదులు ఎన్ని వచ్చాయి. వాటిలో ఎన్నింటిని పరిష్కరించామనేది ప్రజలకు మీడియా ద్వారా వారం వారం తెలియజేయాలన్నారు.

'జయకృష్ణే మా ఎమ్మెల్యే అభ్యర్థి'

ప్రజాశక్తి-పాలకొండ

పొత్తుల్లో భాగంగా పాలకొండ ఎమ్మెల్యే టికెట్ జనసేనకు కేటాయిస్తారనే వదంతులు సరి కాదని, ఎన్నో ఏళ్లుగా పార్టీనే నమ్ముకుని తన సొంత ఆస్తులు అమ్ముకుని పార్టీని నియోజకవర్గంలో నిలబెడుతున్న జయకృష్ణ కే టికెట్ కేటాయించాలని పార్టీ శ్రేణులు కోరాయి. ఆదివారం పట్టణంలో ఒక ప్రయివేటు కల్యాణమండపంలో టిడిపి నాయకులు నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జయకృష్ణకు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేయాలని సిద్ధమవుతున్నామని అన్నారు. పొత్తుల్లో భాగంగా వేరే పార్టీకి టికెట్ కేటాయిస్తే గెలుపు కష్టమని ఈ ప్రాంతంలో టిడిపికి కంచుకోట అని, ఇక్కడ టిడిపి జెండా తప్ప మరో కొత్త పార్టీ జెండాతో ఎన్నికలకు వెళ్లడం కష్టమని అన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ నాయకులు గండి రామి నాయుడు, గంటా సంతోష్, పొదిలాపు కృష్ణమూర్తి, జామి లక్ష్మీ నారాయణ, జాడ శ్రీధర్, వెన్నపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



పట్టణంలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

సూపర్ సిక్స్‌పై పట్టణంలో పచారం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పట్టణంలోని 19, 24 వార్డుల్లో టిడిపి అమలు చేయనున్న సూపర్ సిక్స్‌పై ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్లబొల్లి కబుర్లు చెప్పి ఒక్క ఛాన్స్ అంటూ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగనంత అవినీతికి పాల్పడ్డ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, రాబోయే ఎన్నికల్లో బుద్ధి చెప్పి అధికారాన్ని టిడిపికి అందించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా ప్రజలు చూడాలనుకుంటున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే బీసీల సంక్షేమానికి ప్రత్యేక ప్లాన్ అమలుపర్చి 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలతో మహిళలకు మహాశక్తి వంటి పథకాలతో ఆదుకొని వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. వార్డుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుస్తుంటే వారు ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకతతో ఉన్నారో అర్థమవుతుందన్నారు. కావున రాబోయే ఎన్నికలలో పార్వతీపురం నియోజకవర్గంలో టిడిపి అత్యధిక ఓట్లతో గెలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని జరడ, నీలకంఠాపురం, దండుసూర, ధర్మ లక్ష్మీపురం, మామిడిమానుగూడ, జుంబరి గిరిజన గ్రామాల్లో టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి టి. జగదీశ్వరి పాల్గొని ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శంకర్, మహిళా ప్రధాన కార్యదర్శి వెంపటాపు భారతి, యూనిట్ ఇంచార్జ్ కిరణ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు విడతల్లో రూ.20 కోట్లు పంపిణీ


ప్రజాశక్తి - పాచిపెంట

వైయస్సార్ చేయూత పథకం కింద నాలుగు విడతల్లో మండలంలోని లబ్ధిదారులకు సుమారు రూ.20 కోట్లు అందజేశామని, మహిళలకు అండగా వైసిపి ప్రభుత్వం నిలుస్తుందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని గురువినాయుడుపేట వద్ద వైయస్సార్ చేయూత నాలుగో విడత చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2,997మంది మహిళలకు రూ.5 కోట్ల62 లక్షలు చెక్కును ఆయన అందజేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో సత్య దూరమైన వాగ్దానాలు చెప్పే మోసగాళ్లు, వేషగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. 18 ఏళ్లలో మండలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని తనను ఆశీర్వదించి మరోసారి గెలిపించాలని కోరారు. ఆరేళ్ల ఎమ్మెల్సీగా కొనసాగిన సంధ్యారాణి ఒక్క అభివృద్ధి పనైనా చేసిందో చెప్పమనండి.. అడగండి చేయనిది చేశామని చెప్పుకోవడానికి సిగ్గు ఉండాలని అన్నారు. తాను మాట ఇచ్చానంటే ఎవరి కాళ్లు పట్టుకొనినైనా మాట నిలబెట్టుకుంటానని తనకు మోసం చేయడం చేతకాదని అన్నారు. దోపిడీ, అవినీతి పరులైన టిడిపి నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని మరొకసారి గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బి.ప్రమీల, జడ్పీ వైస్ చైర్మన్ కె.సింహాచలం, మండల వైసిపి గొట్టాపు ముత్యాలునాయుడు, డోల బాబ్జీ, పి.వీరమనాయుడు, కె.రవీంద్ర, టి.గౌరీశ్వరరావు, స్థానిక సర్పంచ్ చిట్టెమ్మ, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, ఎపిఎం జయకుమార్, సిసిలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మక్కువ :ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ప్రజలను మోసం చేసే టిడిపి మోసగాళ్ల వలలో పడవద్దని రాజన్న దొర మహిళలకు సూచించారు. చేయూత లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో నూతన తరగతి గదులను ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసిపి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ సీఎం గా చేసుకుంటేనే ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహిళలకు వివరించారు. టిడిపి హయాంలో ఎమ్మెల్సీగా పనిచేసిన గుమ్మడి సంధ్యారాణి మండలంలోని తన పుట్టిన ఊరుకైనా ఏ ఉపకారం చేసిందానని ప్రశ్నించారు. ఎమ్మెల్సీగా పదవి పొంది ప్రజలకు ఏ ఉపకారం చేయని వ్యక్తిని మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఏ మొహం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడగడానికి వస్తున్నారో చెప్పండని ప్రజలే నిలదీయాలని సూచించారు. కన్నీరు పెట్టుకొని పుట్టింటి ఆడపడుచునంటూ చెప్పే బూటకపు మాటలను నమ్మి మోసపోవద్దని అన్నారు. జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఐదో సారి రాజన్నదొరను ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే మండలం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. మతం పేరుతో మోడీ దేశ ప్రజలను మోసగిస్తున్నారని, వేషగాడైన పవన్‌కల్యాణ్ తో ప్రజల్లోకి దండుగా వస్తున్నారని వారి పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మళ్లీ వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మర్రి పారమ్మ, మండల వైసిపి అధ్యక్షులు రంగు నాయుడు, ఎంపిడిఒ దేవకుమార్, ఎపిఎం సన్నిబాబు, పలువురు ప్రజా పతినిధులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన సభలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి వైయస్సార్ చేయూత చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సంక్షేమ పాలనకు ఓటేసి జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్, వైస్ ఎంపిపిలు బి.లక్ష్మి, నేరేడుబిల్లి లక్ష్మి, సర్పంచులు కలిశెట్టి ఇందుమతి, మచ్చ నారాయణమ్మ, బొంతాడ మహేశ్వరరావు (మహేష్) తోటపల్లి దేవస్థానం చైర్మన్ మర్రాపు సత్యనారాయణ, వైసిపి నాయకులు రౌతు రామినాయుడు, దేవాతి జోజి, ముదిలి గౌరునాయుడు, ఎపిఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సిసిలు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం
డిప్యూటీ సిఎం రాజన్న దొర



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

దత్తత అధికారులతో అవగాహన సదస్సులు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ప్రిజం-10 దత్తత అధికారుల అవగాహన సదస్సులు ఆదివారం విస్తృతంగా జరిగాయి. వివిధ మండలాల ప్రత్యేక అధికారులు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. అవగాహన సదస్సులో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మండల అధికారులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు సీతంపేట, పాలకొండలలో పాల్గొనగా, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె రామచంద్ర రావు సాలూరు, పాచిపెంటలలో, డి ఆర్ డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై సత్యం నాయుడు పార్వతీపురంలో, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్ కురుపాంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ స్థాపన ధ్యేయంగా జిల్లాలో ప్రిజమ్ 10 ను అమలవుతోంది. పదేళ్లలోపు పిల్లల్లో మరణాల నివారణపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. ప్రతి తల్లీ ప్రతీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలని, ఏ ఒక్క తల్లి బిడ్డ రక్తహీనత వల్ల మాతా, శిశు మరణాలు సంభవించ కూడదని పేర్కొన్నారు. అవగాహన సదస్సులో ప్రిజం-10 లో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం పట్ల అవగాహన కల్పించాలాలని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే రేషన్ లబ్దిదారులు మాత్రమే తినాలన్నారు. గర్భిణులను గుర్తించి తక్షణం నమోద చేయాలని, రక్త హీనత గల బాలింతలు, చిన్నారులు, తక్కువ బరువు గల చిన్నారులు, వయస్సుకు తగ్గ ఎత్తు లేని చిన్నారులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. రక్తహీనత గల వారికి సమయానుసారంగా హెమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని సూచించారు. మండలంలో రక్తహీనత గల వారిని గుర్తించి వారి పర్యవేక్షణకు విధిగా దత్తత అధికారిని నియమించాలని పేర్కొన్నారు. దత్తత అధికారులు నెలలో కనీసం మూడు సార్లు సందర్శించాలని, హీమోగ్లోబిన్ స్థాయి పరిశీలనతో పాటు వారికి అందిస్తున్న పౌష్టికాహారం, మందులు లబ్దిదారులు మాత్రమే తీసుకుంటున్నారా? లేదా కుటుంబ సభ్యులు కూడా భాగస్వామ్యం అవుతున్నారా పరిశీలించాలని అన్నారు. పరిశీలించిన అంశాలను డైరీలో నమోదు చేయాలని, మరోసారి సందర్శన సమయంలో వ్యత్యాసాలను గమనించాలని చెప్పారు. సమావేశాల్లో వైద్యాధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట: స్థానిక వైటిసిలో సీతంపేట, భామిని వైద్యాధికారులు, ఐసిడిఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ జగన్నాథరావు మాట్లాడుతూ గ్రామాల్లో దత్తత అధికారులను నియమించామని, గర్భిణీలు, బాలింతల బాగోగులు తెలుసుకోవాలని చెప్పారు. ఐసిడిఎస్ ద్వారా తల్లులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రిజం-10 పగడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, వైద్యాధికారులు రవీంద్ర కుమార్, సాయి చరణ్, భాను ప్రతాప్, సిడిపిఒ రంగలక్ష్మి. ఎపిఎం విజయ్ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మాతా శిశు ఆరోగ్య అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు స్పష్టం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీతానగరం, బలిజిపేట మండలాలకు చెందిన వైద్య సిబ్బంది, అడాప్షన్ ఆఫీసర్స్, స్వయం సహాయక సంఘాలకు ప్రిజమ్10పై ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు సూచనలు చేశారు. గర్భిణీ, బాలింతలకు వారికి అందుబాటులో ఉన్నా అందజేస్తున్న వైద్య సేవలపై వివరించి అవగాహన కల్పించాలన్నారు. బరువు తక్కువతో జన్మించిన శిశువులు, పోషకాహార లోపం, ఎదుగుదల లోపం పిల్లల ఆరోగ్యాన్ని ఐసిడిఎస్ సిబ్బంది సమన్వయంతో తరచుగా పర్యవేక్షించి వారి ఆరోగ్యం వృద్ధి చెందేలా చూడాలన్నారు. డిఆర్‌డిఎ ఎపిడి వై. సత్యంనాయుడు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సిబ్బంది వారి పరిధిలో అర్హులైన జంటల నుంచి గర్భిణీలను త్వరగా గుర్తించి ఆ సమాచారం చేరవేయాలని, సమావేశాలు, గ్రామ సమావేశాల్లో ప్రిజమ్-10 గురించి వివరించాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేసి శిశు మరణాలు రేటు తగ్గించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ పావని, డాక్టర్ శశిధర్, డాక్టర్ నిహారిక, సిహెచ్ఒ ఎస్‌వి రమణ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలతో ఎలా బతకాలి?

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కొదమ పంచాయతీ కొదమ, చోర, చింతామల, డోలింబ మొదలు గ్రామాల్లో టిడిపి నిర్వహించిన బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం అభ్యర్థి సంధ్యారాణి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత గిరిజనులకు గతంలో అందించే చాలా పథకాలను రద్దు చేశారన్నారు. వైటిసి ద్వారా కొండపై ఉండే గర్భిణులు ప్రసవమయ్యే వరకు అన్ని సదుపాయాలు కల్పించే వారని, గిరి గోరు ముద్ద పథకం ద్వారా అన్ని సరుకులు అందించే వారిని, ట్రైకార్, సబ్సిడీ రుణాలను ఇచ్చేవారని అన్నారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే గిరిజనులకు న్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలను గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేష్, అరకు నియోజకవర్గ తెలుగు మహిళ అధికార ప్రతినిధి డొంక అన్నపూర్ణ, మాలతీదొర, లక్ష్మణ దొర, లక్ష్మణరావు, బసవయ్య, తిరుపతిరావు, కృష్ణ, బాలాజీ, తౌడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలోని రాజుపేట కూడలి దగ్గర స్కూటీ అదుపు తప్పిన ఘటనలో పట్టణంలోని పెద్దకాపు వీధికి చెందిన దుప్పాడ కుమారి(28) గాయపడ్డారు. ఈమె పనుకువలస దగ్గర ఉన్న వెంట్రుకల ఫ్యాక్టరీలో పని చేస్తూ విధుల్లో భాగంగా ఫ్యాక్టరీకి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని తెలుస్తుంది. ఆమె భర్త పట్టణంలో లంబూరు వారి వీధికి చెందిన లక్ష్మణరావు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు.